క్లుప్తంగా

విద్యార్థికి అభినందన



హాసినిని సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన త్యారాల హాసినిని మంగళవారం పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో సంఘం మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థి భరద్వాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: సివిల్స్‌లో 905 ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన భరద్వాజ్‌ను మంగళవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్యతో పాటు పలువురు నాయకులు భరద్వాజ్ ఇంటికి వెళ్లి, శాలువా కప్పి సత్కరించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రెడ్డి, మల్చలం మురళి, కుర్మయ్య, రుషికేశ్, ప్రశాంత్, గణేష్, బాల్‌రాజ్, అనిల్‌కుమార్, రాజు నాయక్, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఈ నెల 7, 8వ తేదీల్లో మైత్రీ యూత్ ఆధ్వర్యంలో 7వ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9014072649, 8184841089, 9177796946 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. యువకులు పాల్గొని విజయవంతం చేయాలని మైత్రీ యూత్ అధ్యక్షుడు దశరథ కోరారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

ఎమ్మెల్యే కాలె యాదయ్య



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌గుప్తా

షాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి కట్ట మైసమ్మ దేవాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్ట దైవాన్ని కొలవాలని, భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం దేవునికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండు రాహుల్‌గుప్తా, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలని వినతి

షాబాద్: ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా కమిటీ మైనార్టీ విభాగం కన్వీనర్ సయ్యద్ ఇబ్రహీం కోరారు. మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉద్యమకారుల డేటా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల మండల కమిటీ విభాగం జక్కని శివకుమార్, ఉద్యమకారులు రావుల లక్ష్మి, గౌసియాబేగం, వినోద, మతీన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



బోనాల ఊరేగింపు

కొత్తూరు: పట్టణంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ, పోచమ్మ ఆలయాల్లో మంగళవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మైసమ్మ బోనాల ఉత్సవాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల ఆటాపాటలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాల ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భూ భారతితో సత్వర పరిష్కారం

- గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు
- రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- వివరాలు రికార్డుల్లో నమోదు చేసిన అధికారులు



షాద్‌నగర్: నాగులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆర్డీఓ సరిత, రైతులు

షాద్‌నగర్: భూ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆర్డీఓ సరిత అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి భూ సమస్యలపై అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ లోపాల కారణంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అదేవిధంగా ఈ చట్టంలో హక్కుల రికార్డుల సవరణకు అవకాశం ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు కూడా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. భూమి కొనుగోలు, దానం, భాగ పంపిణీ, తనఖా రిజిస్ట్రేషన్, పట్టా మార్పు ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డుల్లో మార్పులు చేసి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేస్తారని వెల్లడించారు. నూతన ఆర్ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతో దోహదపడుతుందన్నారు. భూ వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను కొత్త చట్టంలో పొందుపరిచిందని స్పష్టం చేశారు. రైతులు గ్రామాల్లో నిర్వహించే సదస్సుల్లో దరఖాస్తులు అందజేయాలని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

బోధనంపల్లిలో రెండు సమస్యలు అక్కడికక్కడే..

కేశంపేట: మండలంలో బోధునంపల్లి, లింగంధన గ్రామాల్లో రెవెన్యూ అధికారులు మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. బోధునంపల్లిలో రైతుల నుంచి 04 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెండు విరసత్ కావడంతో అవి అక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ అజాంఅలీ తెలిపారు. మిగతా రెండు దరఖాస్తులతో పాటుగా లింగంధనలో వచ్చిన 13 దరఖాస్తులను తహసీల్దార్ ఆర్డీఓకు పంపించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటుగా ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: బోధునంపల్లిలో రైతుకు ప్రొసీడింగ్ అందిస్తున్న అధికారులు

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. మండల పరిధిలోని ఈదులపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. ఈదులపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దారు హాజరై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈదులపల్లిలో నిర్వహించిన సదస్సులో 19 దరఖాస్తులు వచ్చాయని, అందులో రెండు సమస్యలను తక్షణమే పరిష్కరించామని, మామిడిపల్లిలో నిర్వహించిన సదస్సులో 28 దరఖాస్తులు రాగా.. అందులో రెండు సమస్యలను తక్షణమే పరిష్కరించామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

రైతులు అధైర్యపడొద్దు

శంకర్‌పల్లి: భూ సమస్యలు లేని గ్రామాలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండలంలోని ఎర్వగూడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్డీఓ చంద్రకళతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రైతులు, పట్టాదారులను నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కాగా మొదటిరోజు మండలంలోని ఎర్వగూడలో 5, గోపులారం గ్రామంలో 23 ఫిర్యాదులు అందినట్లు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, తహసీల్దార్ సురేందర్, డిప్యూటీ తహసీల్దార్ బాలక్రిష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్వగూడలో రైతు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

రైతులకు మేలు

కొత్తూరు: భూ భారతితో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలోని ఎస్‌బీపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. కల్వకుంట్ల కుటుంబం లబ్ధి పొందడానికి వీలుగానే అప్పటి ప్రభుత్వం ధరణి చట్టాన్ని అమలు చేసిందన్నారు. ధరణి రాకతో అప్పటికే ఉన్న సమస్యలతో పాటు కొత్తవి కూడా వచ్చినట్లు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతితో రైతులు, భూ యజమానులకు న్యాయం జరుగుతుందన్నారు. భూభారతిలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద కొందుర్గు మండలంలో 573 దరఖాస్తులు వస్తే అందులో 470 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అధికారులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకుంటుందన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రతి పథకాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకు ముందు జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని తూంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఆయన ప్రారంభించి, దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రమేశ్ కుమార్, జగదీశ్వర్, ఎంపీడీఓలు లక్ష్మిఅనురాధ, ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, నాయకులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు

షాద్‌నగర్: పట్టణంలో మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్‌ఎస్ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నాయకులు కేక్‌కట్ చేశారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా దోపోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న పండితులు



చెంచుల వేషధారణలో సిద్ధమైన గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లిలో గల శ్రీదశావతార సహిత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, దోపోత్సవం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మండపం వరకు స్వామివారి ఊరేగింపు చేపట్టారు. మండపం వద్ద చెంచు వేషధారణలో ప్రజలు స్వామివారి ఆభరణాలు దోచుకునే దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మండలంలోని నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: మండల పరిధిలోని రేగడిదోస్వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–05 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం మండలంలోని అల్లవాడ వద్ద ఉన్న రాజ్యలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరికొకరూ ఆప్యాయంగా పలకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చేవెళ్ల డివిజన్‌లో 332 దరఖాస్తులు

చేవెళ్ల: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు సత్వరం పరిష్కారం లభిస్తుందని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని ఆలూరులో తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వర్యంలో, ముడిమ్యాలలో నాయబ్ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా రెవెన్యూ అధికారులు సదస్సులను నిర్వహించారు. ముడిమ్యాలలో పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, సీఐ భూపాల్‌శ్రీధర్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులను ప్రారంభించి ఫిర్యాదులను స్వీకరించారు. ఆలూరు–1లో తహసీల్దార్ కృష్ణయ్య, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సదస్సును ప్రారంభించి ఫిర్యాదులు స్వీకరించారు. మొదటి రోజు ముడిమ్యాలలో 44 ఫిర్యాదులు రాగా, ఆలూరు–1లో 121 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆలూరులో 5 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

చేవెళ్ల డివిజన్‌లో..

చేవెళ్ల రెవెన్యూ డివిజన్‌లో నాలుగు మండలాల్లోని 8 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొదటిరోజున 332 ఫిర్యాదు వచ్చాయని ఆర్డీఓ చంద్రకళ తెలిపారు. వీటిలో 27 దరఖాస్తులు అక్కకడిక్కడే పరిష్కరించబడినట్లు సంబంధిత రైతులకు ప్రొసీడింగ్‌లు అందజేసినట్లు స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మేడిపల్లిలో 84..

మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మేడిపల్లిలో రైతుల నుంచి 84 దరఖాస్తులు రాగా.. వాటిలో కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఏఓ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యాదయ్య, మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, నాయకులు బాల్‌రాజ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యల పరిష్కారం

షాబాద్: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొబ్బిలిగామ, పొలారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అధికారులు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు రైతుల సమస్యలను అడిగి తెలుసుకొని సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: ముడిమ్యాలలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కమిషనర్ సునీత అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మెప్మా విభాగం ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు సంబంధించి స్టాళ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రెవెన్యూ మేళా, పారిశుద్ధ్యంపై వార్డుల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా వంద రోజుల ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. మొక్కలు నాటడం, అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తిచేసి సకాలంలో పనులు పూర్తిచేయడం, మొక్కల పంపిణీ, నాటడం వంటి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అన్ని వార్డుల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరించి తడి, పొడి చెత్తను వేరుచేయడంతో పాటు ప్రజలు వీధి కుక్కల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులు తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న కమిషనర్ సునీత

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

- శాస్త్రవేత్త డాక్టర్ హరీశ్‌కుమార్‌శర్మ
- గ్రామాల్లో 'నాణ్యమైన విత్తనం
- రైతన్నకు నేస్తం' కార్యక్రమం నిర్వహణ
- రైతులకు విత్తనాల పంపిణీ

షాద్‌నగర్: రైతులు నాణ్యమైన విత్తనాలు వాడితేనే అధిక దిగుబడులు వస్తాయని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ హరీశ్‌కుమార్‌శర్మ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం అనే కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఏడీఏ నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హరీశ్‌కుమార్‌శర్మ హాజరై మాట్లాడుతూ.. రైతులు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధికారుల సూచనలు, సలహాలు విధిగా పాటించాలని, తద్వారా మంచి మేలు రకాలైన విత్తనాలు పొంది అధిక దిగుబడులు సాధించగలుగుతారన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ సురేశ్‌గౌడ్, నాయకుడు పంది వెంకట్‌రెడ్డి, ఏఈఓలు గోవర్ధన్, తేజ్‌కుమార్, ప్రణీత, రాంబాబు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

అల్వాలలో..

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైంటిస్టు శ్రీదేవి పాల్గొన్నారు. నాణ్యమైన విత్తనాలను సాగు చేయడంతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. విత్తనోత్పత్తిలో రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం ఎంపిక చేసిన రైతులకు విత్తనాలను అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, ఏఈఓలు వినయ్, నిఖిల్, సుధ, ప్రశాంత్, రైతులు సురేశ్‌రెడ్డి, మధు, మల్లేశ్, ఆనంద్, రాములు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొందుర్గు మండలంలో..

కొందుర్గు: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు పొందవచ్చని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని రైతు వేదికలో 35 మంది రైతులకు కేఎస్ఎం 1638 రకం వరి విత్తనాల కిట్లను ఆయన పంపిణీ చేశారు. అదేవిదంగా పీపీవైఎస్–2 రకం జొన్న విత్తనాల కిట్లను 26 మంది రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ సురేశ్‌రెడ్డి, ఏఈఓలు వాసవి, లక్ష్మీకాంత్, రమణ, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: రైతులతో శాస్త్రవేత్త డాక్టర్ హరీశ్‌కుమార్‌శర్మ, అధికారులు

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్ చౌదరిగూడలో శాస్త్రవేత్త డాక్టర్ అరుణాజ్యోతి 57 మంది రైతులకు కేఎస్ఎం 1638 రకం వరి విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ రాజేందర్‌రెడ్డి, ఏఈఓలు సోని, శ్రీగౌరిప్రియ, స్వాతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ సభ్యుడు వెంకటనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

షాబాద్: పంటల సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జయశంకర్ విశ్వవిద్యాలయం కీటక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ నరేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని రైతువేదికలో జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండల అభ్యుదయ రైతులకు వరి, జొన్న విత్తనాలు మినీకిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశం, ఏఈఓలు రాజేశ్వరి, కిరణ్మయి, లిఖీత, గీత, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.



జిల్లేడ్ చౌదరిగూడలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు



కేశంపేట: రైతులకు విత్తనాలను అందిస్తున్న అధికారులు

రైతుల ఆదాయం పెంపునకు కృషి

మొయినాబాద్: రైతుల ఆదాయాన్ని పెంపొందించడంలో విత్తన నాణ్యత ప్రధాన పాత్ర పోషిస్తుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఎం.సుజాత అన్నారు. 'నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొయినాబాద్‌లో రైతులకు ఆమె విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు కుమార్, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు అవసరం

శంకర్‌పల్లి: రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డా.ప్రీతి సూచించారు. మండలంలోని మోకిలలో 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం'అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కేఎస్ఎం 1638 అనే వరి రకం 10కేజీల బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు, శంకర్‌పల్లి వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, మోకిల పీఏసీఎస్ చైర్మన్ గోపాల్, ఏఈఓలు రామకృష్ణారెడ్డి, మనీషా, మొయినొద్దీన్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు